సాక్షి కర్నూలు

శుక్రవారం, 29, డిసెంబర్, 2023



కేసీకి నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి గురువారం కేసీ కాల్వకు 159 క్యూసెక్కుల నీటి విడుదల చేశారు. డ్యాంలో ప్రస్తుతం 0.954 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



108లో మహిళ ప్రసవం

బేతంచెర్ల: గోర్లగుట్ట గ్రామానికి చెందిన గర్భిణి నాగేశ్వరిని 108లో బేతంచెర్లకు తరలిస్తుండగా మార్గమధ్యలో మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారు.



నంద్యాలలో బాలోత్సవాలు

నంద్యాల మున్సిపల్ టౌన్‌హాల్‌లో గురువారం నంది బాలోత్సవాలు ప్రారంభమయ్యాయి. క్లాసికల్ డ్యాన్స్, చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు పాల్గొన్నారు.

8లో▸

న్యూస్‌రీల్

26 ప్రాసెసింగ్ యూనిట్‌లు మంజూరు

కర్నూలు(అగ్రికల్చర్): వర్షాధార ప్రాంత అభివృద్ధి(ఆర్‌ఏడీ) పథకం కింద 26 ప్రాసెసింగ్ యూనిట్లు మంజూరు కాగా వీటిని రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు మంజూరు చేయనున్నారు. ప్రాసెసింగ్ యూనిట్లకు 50 శాతం సబ్సిడీ లేదా రూ.2 లక్షలు ఇందులో ఏదీ తక్కువైతే దానిని సబ్సిడీగా ఇస్తారు. మొదటి ప్రాధాన్యత కింద మిల్లెట్స్‌కు సంబంధించిన ప్రాసెసింగ్ యూనిట్లు మంజూరు చేస్తారు. రెండో ప్రాధాన్యత కింద పల్సెస్ ప్రాసెసింగ్ యూనిట్లు, మూడో ప్రాధాన్యత కింద వేరుశనగ ప్రాసెసింగ్ యూనిట్లును ఏర్పాటు చేసుకునే వీలుంది.

- మిల్లెట్స్, పల్సెస్, వేరుశనగ ప్రాసెసింగ్ యూనిట్లుకు సంబంధించి మిషనరీ సరఫరాకు 5 సంస్థలను ఎంపిక చేశారు.
- ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు సంబంధించి 58 రకాల మిషనరీల ధరలు కూడా ఖరారయ్యాయి.
- మిల్లెట్స్/పల్సెల్స్/వేరుశనగ ప్రాసెసింగ్ యూనిట్లను రైతు ఉత్పత్తిదారుల సంఘాలకే కేటాయిస్తారు. సబ్సిడీ కూడా విడుదలైంది.
- కర్నూలు సబ్ డివిజన్‌కు 5, పత్తికొండ, ఆలూరు సబ్ డివిజన్‌లకు 7 ప్రకారం, ఆదోని సబ్ డివిజన్‌కు 4, ఎమ్మిగనూరు సబ్ డివిజన్‌కు 3 ప్రకారం ప్రాసెసింగ్ యూనిట్లు కేటాయించారు.
- వీటిపై రైతుఉత్పత్తిదారుల సంఘాలకు అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి ఏఓ, ఏడీఏలకు సూచించారు.

జనవరి 19లోపు పరీక్ష ఫీజు చెల్లించాలి

కర్నూలు సిటీ: ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియెట్ చదువుతున్న వారు వచ్చే నెల 19వ తేదీలోపు పరీక్ష ఫీజు చెల్లించాలని డీఈఓ రంగారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 5 నుంచి ఫీజులు చెల్లించే ప్రక్రియ మొదలు అవుతుందని పేర్కొన్నారు. ఒక సబ్జెక్టుకు రూ.25 అపరాధ రుసుంతో వచ్చే నెల 20 నుంచి 27వ తేదీలోపు, రూ.50 అపరాధ రుసుంతో 28 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు, తాత్కాల్ కింద ఫిబ్రవరి 9వ తేదీ వరకు ఫీజులు చెల్లించవచ్చునని తెలిపారు.

పేద గుండెకు 'ఎలాగ్జిమ్' భరోసా

- ప్రభుత్వాసుపత్రుల్లో ఖరీదైన ఇంజక్షన్
- పత్తికొండలో గుండెపోటు బాధితున్ని కాపాడిన వైద్యులు



చాకలి రంగయ్యకు ఎలాగ్జిమ్ ఇంజెక్షన్ వేస్తున్న డాక్టర్ వెంకటేశ్వర్లు

పత్తికొండ రూరల్: హృద్రోగులను ప్రాణాపాయం నుంచి కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఖరీదైన ఎలాగ్జిమ్ ఇంజక్షన్‌ను అందుబాటులో ఉంచింది. గుండెపోటుకు గురైన పేదలు ఈ ఇంజక్షన్ వేసుకుని ప్రాణాలు కాపాడుకోవచ్చు. పత్తికొండ మండల పరిధిలోని హోసూరు గ్రామానికి చెందిన చాకలి రంగయ్య గురువారం ప్రాణాపాయం నుంచి ఇలానే బయటపడ్డారు. గుండెపోటుకు గురైన వెంటనే అతన్ని కుమారుడు పరశురాం పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చాడు. అక్కడ డ్యూటీ డాక్టర్‌గా ఉన్న వెంకటేశ్వర్లు రూ.40వేలు విలువైన ఎలాగ్జిమ్ ఇంజక్షన్ వేసి అతన్ని ప్రాణాపాయం నుంచి కాపాడారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలుకు పంపారు. బాధిత కుటుంబ సభ్యులు ప్రభుత్వానికి, వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కల్పన మాట్లాడుతూ.. పేదల వైద్యానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఖరీదైన వైద్యసేవలు కూడా ప్రభుత్వాసుపత్రుల్లో అందుబాటులోకి వచ్చాయని చెప్పారు.

మద్దిలేటయ్య హుండీ ఆదాయం రూ.40.81 లక్షలు



కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

బేతంచెర్ల: మద్దిలేటి నరసింహస్వామి ఆలయానికి హుండీల ద్వారా రూ. 40.81 లక్షల ఆదాయం వచ్చింది. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు రెడ్డి పర్యవేక్షణలో ఆలయ ఈఓ పాండురంగారెడ్డి, చైర్మన్ సీతారామ చంద్రుడు ఆధ్వర్యంలో44 రోజులకు సంబంధించి హుండీ కానుకల లెక్కింపును గురువారం చేపట్టారు. రూ. 40,81,010 నగదు, 26 గ్రాముల బంగారం, 2.400 కిలోల వెండి వచ్చింది.



ఓర్వకల్లు సమీపంలోని జయరాజ్ ఇస్పాత్ ఫ్యాక్టరీ

- ఓర్వకల్లు మండలంలో 1,000 ఎకరాల్లో రూ.2,960 కోట్లతో జయరాజ్ ఇస్పాత్ లిమిటెడ్ పేరుతో భారీ ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ త్వరలో ప్రారంభం కానుంది. ఇప్పటికే ఈ ప్లాంట్‌కు సంబంధించి 400 ఎకరాల్లో 85 శాతం సివిల్ వర్క్, 75 శాతం స్ట్రక్చర్, 65 శాతం ఎరక్షన్ పనులు పూర్తయ్యాయి. ఈ పరిశ్రమలో ఉత్పత్తులు ప్రారంభమైతే దాదాపు 1,500 మందికి ఉపాధి అవకాశాలు లభించే అవకాశాలు ఉన్నాయి.

పరిశ్రమల సై'రన్'

వైఎస్సార్‌సీపీ పాలనలో నూతనంగా ఏర్పాటైన పలు ఫ్యాక్టరీలు

- ఓర్వకల్లు మండలంలో ఫ్రెష్ బౌల్ హార్టికల్చర్, జయరాజ్ ఇస్పాత్, సిగాచీ పరిశ్రమలు
- మంత్రాలయం మండలంలో మారుతీ ఇస్పాత్ అండ్ ఎనర్జీ ఎక్స్‌టెన్షన్
- తుగ్గలి మండలంలో జియో మైసూర్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్
- వేలాది మంది యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి



ఓర్వకల్లు సమీపంలోని పుట్టగొడుగుల కంపెనీలో పనిచేస్తున్న కార్మికులు



ఫ్యాక్టరీలో రూపాంతరం చెందుతున్న పుట్టగొడుగులు



జొన్నగిరి సమీపంలోని జియో మైసూర్ పరిశ్రమ

కర్నూలు(అర్బన్): రాయలసీమ ముఖద్వారమైన కర్నూలు జిల్లాలో పరిశ్రమల సైరన్ మోగుతోంది. పారిశ్రామిక రంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేసింది. పారిశ్రామికవేత్తలకు పలు ప్రోత్సాహకాలు ఇస్తోంది. కరోనా అనంతరం జిల్లాలో అనేక చిన్న, పెద్ద పరిశ్రమలు పురుడు పోసుకున్నాయి. ఇక్కడ ఏర్పాటైన పరిశ్రమల్లోని ఉత్పత్తులు పక్క రాష్ట్రాలతో పాటు దేశ సరిహద్దులు కూడా దాటి పోతున్నాయి. కర్నూలు జిల్లాలో పలు పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలమైన వాతావరణం ఉంది. దీంతో పారిశ్రామికవేత్తలు వేల కోట్ల రూపాయలు పెట్టుబడులు పెట్టి పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు ముందుకు వస్తున్నారు. ఆయా పరిశ్రమల ఏర్పాటుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మంది నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి.

జిల్లాలో ఏర్పాటైన, ఏర్పాటవుతున్న పరిశ్రమలు

- ఓర్వకల్లు మండలం కాల్వ గ్రామ సమీపంలో 36.50 ఎకరాల విస్తీర్ణంలో రూ.80 కోట్ల పెట్టుబడితో ఫ్రెష్ బౌల్ హార్టికల్చర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఏర్పాటైంది. ఈ పరిశ్రమ నుంచి పుట్టగొడుగులు ఉత్పత్తి అవుతున్నాయి. వీటిని మన రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు పక్కనున్న కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. 2019 సంవత్సరంలో 5 టన్నులతో ప్రారంభమైన ఉత్పత్తి నేడు 11 టన్నులకు చేరుకుంది. ఈ పరిశ్రమ ఏర్పాటుతో 400 మందికి ఉపాధి లభిస్తోంది.
- ఓర్వకల్లు మండలంలో సిగాచీ ఇండస్ట్రీస్ లిమిటెడ్ పేరుతో రూ.64.50 కోట్ల పెట్టుబడితో మరో ఫార్మా కంపెనీ ప్రారంభం కానుంది. ఈ పరిశ్రమలో మెడికల్‌కు సంబంధించి ఎక్సీపియెంట్స్(సహాయక పదార్థాలు) తయారు కానున్నాయి.
- కోడుమూరు మండలం ముడుమలగుర్తి గ్రామ సమీపంలో రూ.1000 కోట్లతో మినరల్ ప్రాసెసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎంపీఎల్) స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించి భూసేకరణ జరుగుతోంది. ఇక్కడ ఈ పరిశ్రమ ఏర్పాటైతే దాదాపు 2,500 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.
- మంత్రాలయం మండలం మాధవరం సమీపంలో ప్రస్తుతం ఉన్న మారుతీ ఇస్పాత్ అండ్ ఎనర్జీ లిమిటెడ్ పరిశ్రమకు అనుబంధంగా రూ.100 కోట్లతో మరో స్పాంజ్ ఐరన్ యూనిట్ (స్టీల్ ప్లాంట్) నెలకొల్పేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఈ యూనిట్ ప్రారంభమైతే 150 మందికి ఉపాధి లభించే అవకాశాలు ఉన్నాయి.
- తుగ్గలి మండలం జొన్నగిరి సమీపంలోని 30 ఎకరాల్లో రూ.320 కోట్లతో జియో మైసూర్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో గోల్డ్ మైనింగ్ ప్రాసెసింగ్ ప్లాంట్‌కు ఈ ఏడాది సెప్టెంబర్ నెలలో భూమి పూజ జరిగింది. దేశంలోనే తొలి గోల్డ్ మైనింగ్ ప్లాంట్ ఇది. ఏడాదికి 750 కిలోల బంగారాన్ని ఉత్పత్తి చేయడమే లక్ష్యంగా పనులు జరుగుతున్నాయి. బంగారు నిక్షేపాలను వెలికితీసే ఈ డీప్ మైనింగ్‌లో ప్రస్తుతం వంద మంది వరకు ఉపాధి పొందుతున్నారు. మరో 200 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని కంపెనీ చైర్మన్ చార్లెస్ డెవినిష్, మేనేజింగ్ డైరెక్టర్ హనుమప్రసాద్ ఇటీవల తెలిపారు.

జగనన్న బడుగు వికాసం కింద రూ.33.91 కోట్ల రాయితీ

జిల్లాలో జగనన్న బడుగు వికాసం కింద ఎస్సీ, ఎస్టీలకు 2022–23 సంవత్సరం వరకు (ఐడీపీ 2020–23, జగనన్న బడుగు వికాసం) 465 క్లైయిమ్స్‌కు రూ. 22.78 కోట్లు, 2023–24 సంవత్సరం కింద ఇప్పటి వరకు 121 క్లైయిమ్స్‌కు రూ.11.13 కోట్లు పారిశ్రామిక రాయితీలుగా మంజూరు చేశారు.

ప్రభుత్వ ప్రోత్సాహం బాగుంది



మాది చెన్నై. నేను ఎమ్మెస్సీ మైక్రో బయోలజీ చేశాను. పలు ప్రాంతాల్లో ఉద్యోగం కోసం చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఏపీలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాలు బాగున్నాయి. ఓర్వకల్లు మండలంలో ఏర్పాటైన ఫ్రెష్ బౌల్ హార్టికల్చర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగం సంపాదించా. ప్రస్తుతం పీఎఫ్, ఈఎస్‌ఐ పోను నెలకు రూ.35 వేలు జీతం వస్తోంది. – ధనశేఖర్

ప్రతి రోజూ పని దొరుకుతోంది



భర్తను కోల్పోయి నలుగురు పిల్లలతో పేదరికంలో ఉన్నా. కంపెనీలో నాకు పని లభించడం చాలా సంతోషంగా ఉంది. ఆరు సంవత్సరాలుగా ఇక్కడే పనిచేస్తున్నా. రోజుకు రూ.400 కూలి ఇస్తున్నారు. వచ్చే డబ్బుతో ఇద్దరు పిల్లలకు వివాహాలు చేశా. మిగిలిన ఇద్దరు చదువుకుంటున్నారు. ఊరికి దగ్గరలోనే ప్రతి రోజూ పని దొరుకుతోంది. ప్రస్తుతం పుట్టగొడుగుల కంపెనీలోని ప్యాకింగ్ సెక్షన్‌లో పని చేస్తున్నా. – నూర్జహాన్, బేతంచెర్ల, నంద్యాల జిల్లా

తల్లిదండ్రుల వద్ద ఉంటూనే ఉద్యోగం చేస్తున్నా



మాది తుగ్గలి మండలం బొల్లవానిపల్లె. మా గ్రామానికి సమీపంలోనే జియో మైసూర్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఏర్పాటైంది. నాలాంటి ఎంతో మందికి ఇక్కడ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. గతంలో నేను పెనుగొండ కియా మోటార్స్, తెలంగాణలోని మిషన్ భగీరథలో పని చేశా. ప్రస్తుతం గ్రామానికి సమీపంలోనే తల్లిదండ్రుల వద్దే ఉంటూ ఉద్యోగం చేయడం సంతోషంగా ఉంది. పీఎఫ్, ఈఎస్‌ఐ పోను నెలకు రూ.25 వేలు జీతంగా అందుతోంది. – ఉదయ్‌సింహారెడ్డి, బీటెక్ (మెకానికల్)

ఇండస్ట్రియల్ హబ్‌గా ఓర్వకల్లు



పారిశ్రామికవేత్తలను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. పరిశ్రమల ఏర్పాటుకు చేయూతనిస్తోంది. జిల్లాలో ఓర్వకల్లును ఇండస్ట్రియల్ హబ్‌గా అభివృద్ధి చేసేందుకు ఎంతో కృషి జరుగుతోంది. ముచ్చుమర్రి నుంచి పైపులైన్ ద్వారా ఇండస్ట్రియల్ హబ్‌కు నీటిని తీసుకువచ్చేందుకు మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పూర్తి సహకారం అందించారు. నీరు పుష్కలంగా ఉంటేనే పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తారు. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం అభినందనీయం. జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందితే అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. ముఖ్యంగా ఉపాధి, ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయి. – జీఆర్‌కే రెడ్డి, ఏపీఐఐసీ జిల్లా రాష్ట్ర వైస్ చైర్మన్

సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం

- అధికారులను ఆదేశించిన జేసీ నారపురెడ్డి మౌర్య



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన జేసీ మౌర్య, ఎమ్మెల్యేలు శ్రీదేవి, బాలనాగిరెడ్డి, సుధాకర్, కాటసాని, సాయిప్రసాద్ రెడ్డి తదితరులు

కర్నూలు(సెంట్రల్): వైఎస్సార్ పెన్షన్ కానుక, ఆసరా, చేయూత తదితర సంక్షేమ పథకాలపై జనవరి, ఫిబ్రవరి నెలల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య ఆదేశించారు. గురువారం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్లు, ప్రజాప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ నారపురెడ్డి మౌర్య, ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, వై.సాయిప్రసాద్‌రెడ్డి, వై.బాలనాగిరెడ్డి, శ్రీదేవి, డాక్టర్ జె.సుధాకర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్‌చంద్రబోస్, డీసీఎంఎస్ చైర్మన్ శిరోమణి మద్దయ్య, డీఆర్‌డీఏ పీడీ సలీంబాషా పాల్గొన్నారు. అనంతరం జేసీ మాట్లాడుతూ...పెంచిన పింఛన్‌ను జనవరి 1 నుంచి 8వ తేదీ వరకు పండుగ వాతావరణంలో పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో స్థానిక ప్రజాప్రతినిధులు హాజరై పంపిణీ చేసేలా చూడాలన్నారు. ప్రతి మండలంలో ఎమ్మెల్యేలు పెన్షన్ పెంపు కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జనవరి 19న విజయవాడలో 125 అడుగుల భారీ అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రారంభించనున్నారని, ఇందులో ప్రతి సచివాలయం పరిధి నుంచి ఐదుగురు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జనవరి 9 నుంచి దళిత కాలనీల్లో అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణపై సభలు, సమావేశాలు నిర్వహించాలన్నారు. జనవరి 23 నుంచి 30వ తేదీ వరకు వైఎస్సార్ ఆసరా నిధులను పొదుపు మహిళల ఖాతాల్లో జమ చేస్తారని, ఇందు కోసం జనవరి 18 నుంచే విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. ఫిబ్రవరి 5 నుంచి 14వ తేదీ వరకు 'వైఎస్సార్ చేయూత'ను అందించే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. సంక్షేమపథకాలకు అర్హులై ఉండి మిగిలిన పోయిన వారికి వర్తింపజేసే కార్యక్రమం జనవరి 5న ఉంటుందన్నారు.

పేద విద్యార్థులకు ప్రభుత్వ 'దీవెన'

- ఉన్నత చదువులకు ఆర్థిక సాయం
- నేడు 4వ విడత నిధులు జగనన్న విద్యా దీవెన విడుదల
- 33,297 మంది విద్యార్థులకు ప్రయోజనం
- 30,479 మంది తల్లుల ఖాతాల్లోకి జమ కానున్న రూ.21.92 కోట్లు
- భీమవరం నుంచి డీబీటీ ద్వారా విడుదల చేయనున్న సీఎం వైఎస్ జగన్

సామాజిక వర్గాల వారీగా నేడు విడుదల కానున్న మొత్తం

సామాజికవర్గం	మొత్తం విద్యార్థులు	తల్లులు	విడుదల కానున్న మొత్తం
ఎస్సీ	10,237	9,112	రూ.7,53,37,649
ఎస్టీ	607	542	రూ.39,63,469
బీసీ	16,392	15,218	రూ.9,87,78,070
ఈబీసీ	1,597	1,497	రూ.1,39,00,060
ముస్లిం మైనారిటీ	3,746	3,483	రూ.2,18,70,523
కాపు	617	603	రూ.46,32,011
క్రిస్టియన్ మైనారిటీ	101	94	రూ.7,59,656
మొత్తం	33,297	30,479	రూ.21,92,41,438

కర్నూలు(అర్బన్): పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థుల ఉన్నత విద్యకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక చేయూతను అందిస్తోంది. ఫీజులు చెల్లించలేక ఆయా వర్గాలకు చెందిన విద్యార్థుల చదువులు మధ్యలోనే ఆగిపోకూడదనే దృఢ సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయా వర్గాలకు చెందిన విద్యార్థులకు ఆర్థిక వారధిలా నిలుస్తున్నారు. జగనన్న విద్యా దీవెన పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తూ విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి నగదును నిర్ణీత సమయానికే జమ చేస్తున్నారు. అలాగే వివిధ కోర్సులు చదువుతున్న అర్హత కలిగిన విద్యార్థులందరికీ ఆహారం, హాస్టల్, ఇతర నిర్వహణ ఖర్చుల కోసం జగనన్న వసతి దీవెన పథకాన్ని అమలు చేస్తున్నారు. దీంతో ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ అంతకంటే ఎక్కువ కోర్సులు చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ తదితర వర్గాలకు చెందిన విద్యార్థులు డ్రాప వుట్స్ లేకుండానే చదువులు కొనసాగిస్తున్నారు.

నేడు నగదు బదిలీ

పశ్చిమ గోదావరి జిల్లాలోని భీమవరంలో శుక్రవారం జరగనున్న బహిరంగసభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న విద్యా దీవెన కార్యక్రమం ద్వారా నగదును బదిలీ చేయనున్నారు. జిల్లాలో అర్హులైన విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి డీబీటీ సిస్టమ్ ద్వారా నగదు జమ కానుంది. జిల్లా కలెక్టర్ డాక్టర్ జీ సృజన ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లోని సమావేశ భవనంలో ఉదయం 11 గంటలకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఆయా సంక్షేమ శాఖలకు చెందిన అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

రూ.21.92 కోట్ల లబ్ధి


2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి జగనన్న విద్యా దీవెన నిధులను విడుదల చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణను ప్రకటించింది. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, ముస్లిం మైనారిటీ, కాపు, క్రిస్టియన్ మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులకు సంబంధించి మొత్తం 30,479 మంది తల్లుల బ్యాంకు ఖాతాల్లోకి రూ.21,92,41,438లు జమ కానున్నాయి.

ఈ ఏడాదిలోనే నాలుగు విడతలు ...

రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాదిలోనే జగనన్న విద్యా దీవెన నిధులను నాలుగు విడతలుగా విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి జమ చేసింది.

నెల	తేది	విద్యార్థుల సంఖ్య	జమ చేసిన మొత్తం(రూ.కోట్లలో)
మార్చి	19	39,312	రూ.24.38
మే	24	30,636	రూ.23.60
ఆగను	28	38,597	రూ.25.03
డిసెంబర్ (నేడు)	29	33,297	రూ.21.92

అర్హులందరికీ విద్యా దీవెన



రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం విడుదల చేస్తున్న జగనన్న విద్యా దీవెన 4వ విడతలో జిల్లాలోని 33,297 మంది విద్యార్థులు ప్రయోజనం పొందనున్నారు. జగనన్న విద్యా, వసతి దీవెన కింద ఆర్థిక తోడ్పాటు పొందేందుకు అర్హులైన విద్యార్థులు గ్రామ/వార్డు సచివాలయాల్లోను, తాము చదువుతున్న కళాశాలల్లో ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలి. పలు సాంకేతిక కారణాలతో అర్హులైన విద్యార్థులకు విద్యా, వసతి దీవెన విడుదల కాకుంటే వెంటనే అబ్జెక్షన్ రైజ్ చేసి వారికి ఫీజులు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమ అయిన విద్యా దీవెన నగదును నిర్ణీత సమయంలోగా ఆయా కళాశాలల్లో చెల్లిస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవు. – జే రంగలక్ష్మిదేవి, జేడీ, సాంఘిక సంక్షేమ శాఖ

సంక్షేమ బావుటా

చేదోడు పథకం భరోసానిచ్చింది



రెడిమేడ్ దుస్తుల వాడకం పెరగడంతో టైలర్లకు పనిలేకుండా పోయింది. షాపుల అద్దె చెల్లించాలన్నా కష్టంగా ఉండేది. ప్రజా సంకల్ప పాదయాత్రలో కులవృత్తుల వారి కష్టాలు విన్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వారికి ఆర్థిక సాయం అందించేందుకు హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడి అర్హులైన వారందరికీ ఏడాదికి రూ.10వేల చొప్పున ఆర్థిక సాయం చేశారు. నాలుగేళ్లుగా నగదు అందుతోంది. కులవృత్తులపై ఆధారపడి జీవిస్తున్న మాలాంటి వారికి జగనన్న చేదోడు పథకంతో ఎంతో భరోసా ఇచ్చింది. – వీరేష్, టైలర్, ఆలూరు

ఈ ప్రభుత్వమే మళ్లీ రావాలి



మాది సంచార జాతికి చెందిన కుటుంబం. కొన్నేళ్లుగా హొళగుందలోని బుడగజంగాల కాలనీలోనే నివాసం ఉంటున్నాం. గతంలో మా ఆయన బుడగ జంగాలి రంగన్న బుర్ర కథలు చెప్పేవాడు. నేను కూలి పనులు చేసుకునే దాన్ని. ఆర్థిక పరిస్థితి సరిగ్గా ఉండేది కాదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మా బతుకులు మారాయి. చేయూత పథకం కింద ఏడాదికి రూ.18,750 ఇస్తున్నారు. ఈ డబ్బుతో దుస్తుల వ్యాపారం మొదలు పెట్టా. అందులో వచ్చే లాభంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నా. ఇంతకు ముందు మాకు ఏ పథకాలు వచ్చేవి కావు. ఈ ప్రభుత్వం మా కష్టాన్ని తీర్చింది. ఇదే ప్రభుత్వం మళ్లీ రావాలి. – బుడగ జంగాల లక్ష్మమ్మ

క్లుప్తంగా

వైద్య ఆరోగ్యశాఖలో వాహనాల వేలం



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ రామగిడ్డయ్య

కర్నూలు(హాస్పిటల్): వైద్య ఆరోగ్యశాఖలో కాలపరిమితి తీరిన 13 వాహనాలకు వేలం వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి పొందినట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య చెప్పారు. గురువారం ఆయన తన చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ–వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన పూర్తి నిర్ణయాధికారం తమ పరిధిలో ఉంటుందన్నారు. సమావేశంలో ఏవో అరుణ, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సునీల్, చీఫ్ మెకానికల్ ఇంజినీర్ సుధారాణి, సర్వీస్ ఇంజినీర్‌తారమోహన్‌రావు, డెమో ప్రమీలాదేవి పాల్గొన్నారు.

బావిలో పడి వీఆర్‌ఏ మృతి



వెంకటకృష్ణ మృతదేహం

ఓర్వకల్లు: మిదివేముల గ్రామ రెవెన్యూ సేవకుడు (వీఆర్‌ఏ) బోయ వెంకటకృష్ణ(32) బావిలో పడి మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల 26వ తేదీన బయటకు వెళ్లిన వెంకటకృష్ణ రాత్రయిన తిరిగి రాకపోవడంతో 27వ తేదీన ఆయన భార్య వెంకటేశ్వరమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా గ్రామ శివారులోని మద్దిలేటి నాయుడు అనే రైతుకు చెందిన బావి వద్ద చెట్టుపై దుస్తులు కనిపించాయి. అనుమానంతో బావిలో నీటిని బయటకు తోడించగా వెంకటకృష్ణ మృతదేహం కనిపించింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గురువారం ఉదయం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి మార్చురీకి తరలించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ రాజారెడ్డి తెలిపారు. మృతునికి ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు.

హోరా హోరీగా..



దొర్నిపాడు ఉన్నత పాఠశాలలో ఖోఖో ఆడుతున్న బాలికలు



కర్నూలు బి.క్యాంప్ హైస్కూల్ గ్రౌండ్‌లో కబడ్డీ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు



నంద్యాల పట్టణం పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో వాలీబాల్ ఆడుతున్న దృశ్యం



కర్నూలు ఎస్టీబీసీ కళాశాల మైదానంలో క్రికెట్ ఆడుతున్న దృశ్యం

సిక్స్‌కు రూ. 200.. వికెట్‌కు రూ. 500



చాగలమర్రి సచివాలయ స్థాయి క్రికెట్ పోటీలో ప్రతిభ చాటిన క్రీడా కారులకు నగదు బహుమతిని అందజేస్తున్న అతిథులు

చాగలమర్రి: ఆడుదాం–ఆంధ్ర పోటీల క్రీడాకారులను ప్రోత్సహించేందుకు అధికారులు, నాయకులు నగదు బహుమతులు ప్రకటించి మరింత ఉత్సాహాన్ని నింపుతున్నారు. చాగలమర్రిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గురువారం జరిగిన క్రికెట్‌పోటీల సందర్భంగా వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల అధ్యక్షుడు మహబూబ్‌షరీఫ్, ఎంపీటీసీ బబ్లూ క్రీడాకారులను ప్రోత్సహించటానికి ప్రతి సిక్స్‌కు రూ.200, వికెట్‌కు రూ.500 ప్రకటించారు. ఈ మేరకు ఆయా జట్లలోని రఫీ 2, ఇర్ఫాన్ 2, శివా 1 సిక్స్‌లు కొట్టి రూ.1,000 నగదు బహుమతిని అందుకున్నారు. అలాగే వికెట్ తీసిని మరో ముగ్గురికి రూ. 500 చొప్పున రూ.1,500 అందజేశారు.



క్రికెట్‌లో మెరిసిన కాశీం, సల్మాన్

మెరిసిన యువకులు

మద్దికెర: పెరవలి గ్రామంలో పెరవలి, హంప, బసినేపల్లి గ్రామ సచివాలయ పరిధిలోని యువకులు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా గురువారం జరిగిన క్రికెట్ పోటీల్లో మెరిసి తమ సత్తాను చాటారు. పింజరి కాశీం అనే యువకుడు 15 బంతుల్లో 46 పరుగులు సాధించాడు. అలాగే అదే జట్టులో సల్మాన్ 2 ఓవర్లలో మూడు వికెట్లు తీసి తమ జట్టు విజయానికి కారకులయ్యారు. ఫైనల్ మ్యాచ్‌లో జీజీ యూత్, ఆర్‌చాలెంజర్స్ బీ రెండు జట్లు పోటీ పడ్డాయి. జీజీ యూత్ నిర్ణీత పది ఓవర్లలో 74 పరుగులు సాధించగా ఆర్ చాలెంజర్స్ బీ 5.3 ఓవర్లలో 75 పరుగులు సాధించి విజయం సాధించారు. జట్టు విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించిన యువకులను గ్రామస్తులు, అధికారులు అభినందించారు.



కృష్ణగిరి మండలం కంబాలపాడులో బ్యాడ్మింటన్ పోటీలు



కర్నూలు ఔట్‌డోర్ స్టేడియంలో ..

పరుగుల వరద



నంద్యాల(సిటీ): నంద్యాల పట్టణం 37వ వార్డు నందమూరి నగర్‌లో గురువారం జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో పరుగు సునామీ సృష్టించాడు సురేష్‌నాయక్. వార్డు సచివాలయ పరిధిలో జరిగిన క్రికెట్ పోటీలో 20 బంతుల్లో 70 పరుగులు సాధించాడు. ఇందులో 7 సిక్సర్లు, 4 ఫోర్లు, 7డబుల్స్, రెండు సింగల్స్ ఉన్నాయి. నందమూరి నగర్ టీమ్–1 ముందుగా బ్యాటింగ్ చేసి పది ఓవర్లలో 167 పరుగులు చేసి, నందమూరి నగర్ టీమ్–2ను 44 పరుగులకే ఆల్ అవుట్ చేసి గెలుపొందింది.

దొంగ అరెస్టు



దొంగను అరెస్టు చూపుతున్న పోలీసులు

కర్నూలు: స్థానిక రోజా వీధిలోని వెంకట ముని సాయి మందుల దుకాణంలో ఈనెల 22న జరిగిన చోరీ ఘటనలో పక్కా ఆధారాలతో రెండవ పట్టణ పోలీసులు దొంగను అరెస్టు చేసి కటకటాలకు పంపారు. దుకాణం వెనుక వైపు తలుపులు తీసి దొంగ రూ.లక్ష అపహరించి పరారయ్యారు. దుకాణం యజమాని వరప్రసాద్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి పాతబస్టాండ్ సమీపంలోని అజంతా హోటల్ వద్ద యువకుడు అనుమానాస్పదంగా సంచరిస్తుండగా అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడు. అతని వద్ద నుంచి రూ.లక్ష నగదును రికవరీ చేసి రిమాండ్‌కు పంపినట్లు రెండో పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా తెలిపారు.

గ్రామ సచివాలయాలతో బాల్య వివాహాల నివారణ

- వలసల నివారణకు ప్రత్యేక చర్యలు
- చదువు ప్రాధాన్యతపై తల్లిదండ్రులకు అవగాహన
- నీతి అయోగ్ సమావేశంలో జిల్లా కలెక్టర్ సృజన





ప్రధాని నరేంద్ర మోదీకి కర్నూలు జిల్లా పరిస్థితులను వివరిస్తున్న కలెక్టర్ సృజన

కర్నూలు(సెంట్రల్): గ్రామ, వార్డు సచివాలయాల సహకారంతో బాల్య వివాహాలను నివారిస్తున్నామని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. గురువారం ఢిల్లీలో నిర్వహించిన నీతి అయోగ్ సమావేశాల్లో దక్షిణాది రాష్ట్రాల నుంచి హాజరైన కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ప్రసంగించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీకి కర్నూలు జిల్లాలోని పరిస్థితులను వివరించారు. జిల్లాలోని హొళగుంద, మద్దికెర, చిప్పగిరి ప్రాంతాల్లో 70 శాతం మంది ప్రజలు సీజనల్‌గా వలస వెళ్తున్నట్లు గుర్తించి, నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. నిరక్షరాస్యత అధికంగా ఉండడంతో బాల్య వివాహాలు జరుగుతున్నాయని, ఈ ఆర్థిక సంవత్సరంలో 60 బాల్య వివాహాలను నిలిపివేసినట్లు చెప్పారు. చదువు ప్రాధాన్యతపై తల్లిదండ్రులకు వివరిస్తున్నామన్నారు. పదో తరగతిలో 90 శాతం మార్కులతో పాసై వ్యవసాయ కూలీగా మారిన హొళగుంద మండలం పెద్దహరివాణం గ్రామానికి చెందిన నిర్మలను ఇంటర్‌లో చేర్పించినట్లు చెప్పారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా జూన్, జూలై, ఆగస్టు నెలల్లో 11 వేల మందిని పాఠశాలలకు రప్పించినట్లు చెప్పారు. వలస వెళ్తున్న విద్యార్థుల కోసం 71 సీజనల్ హాస్టళ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రక్తహీనత నివారణకు కోసం బాలికలకు ఫోలిక్ యాసిడ్ టాబ్లెట్లు, ఐరన్, న్యూట్రీషన్ ఇచ్చినట్లు చెప్పారు. విద్యా కానుక , అమ్మఒడి తదితర పథకాలతో విద్యార్థులు పాఠశాలలకు వస్తున్నారన్నారు. వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా పథకాలు వర్తించాలంటే కచ్చితంగా పదో తరగతి పాసు అవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిబంధన పెట్టడంతో బాల్యవివాహాలకు అడ్డుకట్ట పడుతోందన్నారు.

కుమారుడు మాట వినడం లేదని..



మృతి చెందిన షేక్‌ఫాతిమా

డోన్ రూరల్: కుమారుడు మాట వినడం లేదని ఓ తల్లి మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఓబులాపురం గ్రామంలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్‌ఐ గోపాల్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన షేక్షావలి, షేక్ ఫాతిమా(38) దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు పెయింటర్‌గా, చిన్న కుమారుడు 8వ తరగతి చదువుతున్నాడు. పెద్ద కుమారుడు తమ మాట వినడం లేదని షేక్ ఫాతిమా బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గురువారం పోస్టుమార్టం నిమిత్తం కుటుంబీకులు అప్పగించారు. మృతురాలి భర్త షేక్షావలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

దూసుకొచ్చిన మృత్యువు

- ఐచర్ వాహనం ఢీకొని ఇద్దరు కూలీల మృతి





మృతిచెందిన లాల్‌బాషా, సాయి శశాంక్

ప్యాపిలి: మండల పరిధిలోని పీఆర్ పల్లి గ్రామ సమీపంలో గురువారం జరిగిన ప్రమాదంలో రోడ్డు ప్రమాదంలో ఇద్దరు కూలీలు దుర్మరణం చెందారు. డోన్ పట్టణం కొండపేటకు చెందిన లాల్ బాషా (26), బేతంచెర్ల పట్టణానికి చెందిన నీలకంఠం, లక్ష్మీదేవి కుమారుడు సాయి శశాంక్ (18), శివాజీ అనే కూలీలు పనికి వెళ్లేందుకు పీఆర్ పల్లి వద్ద రోడ్డు పక్కన నిలబడి ఉన్నారు. అదే సమయంలో వేగంగా వచ్చిన ఐచర్ వాహనం కూలీల పైకి దూసుకురావడంతో సాయి శశాంక్, లాల్ బాషా తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం క్షతగాత్రులను డోన్, కర్నూలు ప్రభుత్వాసుపత్రులకు తరలించగా కోలుకోలేక మృతి చెందారు. లాల్‌బాషకు భార్య ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. శివాజీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు జలదుర్గం ఎస్‌ఐ విజయ్ కుమార్ తెలిపారు.

ఐరన్‌గల్లు చర్చిలో రూ.10 లక్షల చోరీ



డాగ్, క్లూస్ టీమ్‌తో దర్యాప్తు చేస్తున్న పోలీస్ సిబ్బంది

కోసిగి: మండల పరిధిలోని ఐరన్‌గల్లు గ్రామంలోని చర్చిలో రూ.10 లక్షలు దోచుకెళ్లినట్లు ఆ చర్చి సంఘం పెద్దలు గురువారం కోసిగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సంఘం పెద్దలు మాట్లాడుతూ.. చర్చి అభివృద్ధికి దాతలు ఇచ్చిన రూ. 10లక్షల నగదును బుధవారం రాత్రి చర్చిలోని బీరువాలో భద్రపరిచామన్నారు. రాత్రికి రాత్రే దొంగలు చర్చి తలుపులు పగలగొట్టి బీరువా తలుపులు తెరచి నగదును దోచుకెళ్లారన్నారు. సంఘం పెద్దల ఫిర్యాదు మేరకు కోసిగి ఎస్‌ఐ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కర్నూలు నుంచి డాగ్, క్లూస్ టీమ్ రప్పించి దర్యాప్తు చేపట్టారు.

పరిశోధన ఫలాలు రైతులకు అందిస్తున్నాం

- ఆంగ్రో వీసీ డాక్టర్ ఆర్. శారదా జయలక్ష్మి



డాక్టర్ శారదా జయలక్ష్మికి మొక్కను అందిస్తున్న డాక్టర్ కేఎస్ఎస్ నాయక్

మహానంది: వరి వంగడాలు, వేరుశనగ, చెరకు, చిరుధాన్యాల సాగుపై చేసిన పరిశోధన ఫలాలను రైతులకు చేరేలా కృషి చేస్తున్నామని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్, ఎక్స్ అఫీషియో చైర్మన్ ఆఫ్ ది బోర్డు మేనేజ్‌మెంట్ డాక్టర్ ఆర్. శారదా జయలక్ష్మీ పేర్కొన్నారు. మహానంది సమీపంలోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ కళాశాలలో గురువారం బోర్డు మేనేజ్‌మెంట్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రాలు, ఏరువాక, వ్యవసాయ పరిశోధనా స్థానాల ద్వారా రైతులకు అందించి రైతుల ఆర్థికాభివృద్ధి కోసం కృషి చేస్తున్నట్లు చెప్పారు. పరిశోధనలకు సాంకేతిక పరిజ్ఞానం తోడవడంతో పరిశోధనలు విస్తృతంగా జరుగుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో ఆంగ్రో పరిధిలో ఏడు కళాశాలలు, మరో ఆరు అనుబంధ కళాశాలలతో పాటు ఇంజినీరింగ్, ఫుడ్ సైన్స్ టెక్నాలజీ కళాశాలలు ఉన్నాయన్నారు. విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే విధంగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బోర్డు మెంబర్లు డాక్టర్ కోదండరామిరెడ్డి, డాక్టర్ పీవీ సత్యగోపాల్, కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కేఎస్ఎస్ నాయక్, అధ్యాపకులు డాక్టర్ ఎంఎస్ రాహూల్, డాక్టర్ గీతా శిరీష, తదితరులు పాల్గొన్నారు. శారదా జయలక్ష్మీ 1998 నుంచి పదేళ్ల పాటు మహానంది వ్యవసాయ కళాశాలలో తెగుళ్ల సస్యరక్షణ (పాథాలజీ) విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేశారు. వీసీ స్థాయిలో కళాశాలకు వచ్చిన ఆమె ఆనాటి మధుర స్మృతులను గుర్తు చేసుకుని అక్కడి వారితో పంచుకున్నారు.

సృజనాత్మకత పెంపొందించేందుకు బాలోత్సవాలు

- ఎంపీ పోచా, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంపీ పోచా, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నంది బాలోత్సవాలను నిర్వహిస్తుందని నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా అన్నారు. గురువారం నంద్యాల పట్టణంలోని మున్సిపల్ టౌన్‌హాల్‌లో నంది బాలోత్సవ కార్యక్రమాన్ని ఎంపీ, ఎమ్మెల్సీ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నంది బాల ఉత్సవాలకు జిల్లా కేంద్రం నంద్యాల వేదిక కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. విద్యార్థుల్లో ఉన్న కళలు, నైపుణ్యాన్ని బయటకు తీసేందుకు ఈ కార్యక్రమం ఎంతో దోహద పడుతుందన్నారు. ఆటాపాటలు, క్విజ్‌పోటీల ద్వారా సామాజిక స్పృహ పెరుగుతుందన్నారు. మొదటి రోజున క్లాసికల్ డ్యాన్స్, ఏకపాత్రాభినయం, వేషధారణ, చిత్రలేఖనం, వ్యాసరచన, పాటల పోటీలు, కూచిపూడి, జానపదం తదితర పోటీల్లో విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో గురురాజ విద్యాసంస్థల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి, బాబన్, శ్రీకాంత్, రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు దస్తగిరి, బాలోత్సవం ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి నాగేష్, గౌరవ సలహాదారు శంకరయ్య, కార్యదర్శి రామరాజు, శేషయ్య, కన్వీనర్ బి.రామరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి మౌలాలి, గురుస్వామి, క్రాంతికుమార్, నాగరాజు, మాణిక్యం, ఉపాధ్యాయులు సుధాకర్, ప్రసాద్, గోపాల్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారం

ఆళ్లగడ్డ: మున్సిపల్ పరిధిలోని చింతకుంట గ్రామంలో ఓ బాలుడు ఏడేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఘటన గురువారం చోటు చేసుకుంది. ఇంటి వద్ద ఆడుకుంటున్న బాలికను ఎవ్వరూ లేని ప్రదేశానికి తీసుకెళ్లి ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ వాహబ్ తెలిపారు.

మత్స్య సహకార సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎన్నికైన వారిని సత్కరిస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా మత్స్య సహకార సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు పోటాపోటీగా జరిగాయి. 11 డైరెక్టర్ పోస్టులకు ఎన్నికలు జరుగగా అన్నింటికీ పోటీ ఏర్పడింది. గూడూరుకు చెందిన ఆర్.శ్రీనివాసులు ప్యానల్ ఎన్నికల్లో విజయం సాధించింది. సహకార శాఖకు చెందిన అసిస్టెంటు రిజిస్ట్రార్ బి.రామకృష్ణయ్య ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. గురువారం బంగారుపేటలోని జిల్లా మత్స్యశాఖ డీడీ కార్యాలయంలో మొదట డైరెక్టర్ల ఎన్నికలు జరిగాయి. డైరెక్టర్లుగా అనకల తిమ్మయ్య, బి.నగేష్, బి.మద్దిలేటి, వెంకటేశ్వర్లు, నంద్యాల చెంచులన్న, ఇ.భాస్కర్, మల్లేశ్వరుడు, టి.పెద్దవీరేష్, పి.శేఖర్, వై.నాగేషు, ఆర్.శ్రీనివాసులు ఎన్నికయ్యారు. అనంతరం ఎన్నికల అధికారి రామకృష్ణయ్య ఆధ్వర్యంలో అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు. ఉమ్మడి కర్నూలు జిల్లా మత్స్యసహకార సంఘం అధ్యక్షుడిగా ఆర్.శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడిగా పెద్దకడుబూరు మండలం చిన్నతుంబళం గ్రామానికి చెందిన పెద్ద వీరేష్ ఎన్నికయ్యారు. అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీనివాసులు మాట్లాడుతూ... జిల్లాలోని మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

కోవిడ్‌కు భయపడాల్సిన పనిలేదు



డాక్టర్ జి.మల్లికార్జున్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): కోవిడ్ జేఎన్–1 వైరస్‌కు భయపడాల్సిన పనిలేదని జిల్లా క్షయ నియంత్రణ కేంద్రం మెడికల్ ఆఫీసర్, ఊపిరితిత్తుల వ్యాధుల నిపుణులు డాక్టర్ జి.మల్లికార్జున్‌రెడ్డి చెప్పారు. గురువారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ ఇటీవల కాలంలో దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో వేగంగా విస్తరిస్తున్న ఈ వైరస్‌తో పెద్ద ప్రమాదమేమీ కాదన్నారు. సాధారణ జలుబు, దగ్గు, స్వల్ప జ్వరంతో ఇది వస్తుందన్నారు. మరికొందరికి ఈ లక్షణాలతో పాటు ఆయాసం కూడా ఉంటుందన్నారు. ఈ లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వైద్యులను కలిసి పరీక్ష చేయించుకోవాలన్నారు. వ్యాధినిర్ధారణ అయితే హోమ్ ఐసోలేషన్‌లో ఉండి వైద్యులు సూచించిన మందులు వాడాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధులున్న వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

మరో ఇద్దరికి పాజిటివ్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు చికిత్స కోసం వచ్చిన వారిలో మరో ఇద్దరికి గురువారం కోవిడ్ పాజిటివ్ నిర్ధారణ అయ్యింది. ఇందులో ఒకరు ఎన్‌టిఆర్ బిల్డింగ్, మరొకరు కృష్ణారెడ్డి నగర్ వాసిగా ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. రెండు రోజుల్లో కోవిడ్ పాజిటివ్ బాధితుల సంఖ్య మూడుకు చేరింది.